క్లుప్తంగా

జగన్‌ను కలిసిన బీటీపీ గోవిందు



గుమ్మఘట్ట: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు బుధవారం తాడేపల్లిగూడెంలో మర్యాద పూర్వకంగా కలిశారు. రాయదుర్గం నియోజకవర్గంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను అధినేత దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఇక్కడి రాజకీయ పరిస్థితుల గురించి వివరించారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని వైఎస్ జగన్ భరోసా కల్పించినట్లు గోవిందు తెలిపారు.

రికార్డుల్లో భూమి గల్లంతు

శెట్టూరు: రీ సర్వే అనంతరం తన భూమిని రికార్డుల్లో లేకండా చేశారని ఆర్డీఓ జి. వసంతబాబుకు రైతు మల్లేశప్ప ఫిర్యాదు చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆర్డీఓకు బసంపల్లి రైతులు ఫిర్యాదు చేశాడు. సర్వే నంబర్ 46–2జీలో తనకు సుమారు 5 ఎకరాల భూమి ఉందని, ఏళ్ల తరబడి సాగుచేస్తున్నానన్నారు. అన్నీ రికార్డులు ఉన్నాయన్నారు. అయితే గత రీ సర్వేల్లో అధికారుల నిర్లక్ష్యం వల్ల తన భూమి రికార్డుల్లో లేకుండా పోయిందన్నారు. అధికారులు స్పందించి తన భూమికి రికార్డులు ఇవ్వాలని కోరారు.

పరామర్శ



నారాయణ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

కూడేరు: రామచంద్రాపురం (పొట్టి చెరువు) గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత నారాయణ కుమారుడు చంద్రశేఖర్ రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి బుధవారం నారాయణ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదం ఏవిధంగా జరిగిందని అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ, రామచంద్రాపురం, బ్రాహ్మణపల్లికి చెందిన నేతలు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపీవీ వైరస్‌పై ఆందోళన వద్దు

ఉరవకొండ: గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండ రామిరెడ్డి తెలిపారు. బుధవారం పలు గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలను చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌ఎంపీవీ వైరస్‌పై ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ ఒక్క కేసు కూడా నమోదు కాలేదన్నారు. ప్రస్తుతం శీతాకాలం దృష్ట్యా పిల్లలు, వృద్ధులకు దగ్గు, జలుబు, జ్వరం లాంటి లక్షణాలు ఉండవచ్చన్నారు. ఎవ్వరు ఆందోళన చెందకుండా పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రభుత్వం ద్వారా మంజూరయ్యే దోమతెరలను అర్హులైన వారికి అందించి దోమల బారిన పడకుండా చర్యలు చేపడుతామన్నారు.

పింఛన్ల తనిఖీ

బ్రహ్మసముద్రం: మండల వ్యాప్తంగా ఉన్న పింఛన్లను అధికారులు పరిశీలిస్తున్నారు. కర్నూల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ వలీబాషా గ్రామాల్లోని పింఛన్‌దారుల ఇంటి వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి చూశారు. అనంతరం వారి ఆరోగ్య సమస్యలపై ఆరాతీసి మెడికల్ రిపోర్ట్‌ను తనిఖీ చేశారు. మండల వ్యాప్తంగా 14 గ్రామ సచివాలయాల పరిధిలోనూ 36 పింఛన్లు ఉన్నట్లు గుర్తించారు.

ప్రత్యామ్నాయం చూపండి



మున్సిపల్ కార్యాలయం ముందు ఆవేదన వ్యక్తం చేస్తున్న ఫుట్‌పాత్ వ్యాపారులు

రాయదుర్గంటౌన్: ఫుట్‌పాత్‌పై నుంచి తొలగించిన మున్సిపల్ అధికారులు తాము వ్యాపారాలు చేసుకోవడానికి ప్రత్యామ్నాయం చూపించి ఆదుకోవాలని వ్యాపారులు కోరారు. బుధవారం వారు మున్సిపల్ కార్యాలయం వద్దకు వచ్చి తమ గోడును అధికారుల ఎదుట వెల్లబోసుకున్నారు. పట్టణంలోని డ్రైనేజీలు, ఫుట్‌పాత్‌ల వద్ద వ్యాపారాలు పెట్టుకుని ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా కొన్నేళ్లుగా జీవనం సాగిస్తూ వచ్చామన్నారు. ఇప్పుడేమో ఉన్నపళంగా వ్యాపారాలను ఆపి.. పొట్టకొడితే తామంతా ఎక్కడకు వెళ్లి వ్యాపారాలు చేసుకోవాలని ప్రశ్నించారు. మా బతుకులకు ఓ దారి చూపాలని విన్నవించారు. కమిషనర్ మాట్లాడుతూ న్యాయం చేసే దిశగా చర్చించి త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

నిప్పు.. అడవులకు ముప్పు!



జంబుగుంపల ఫారెస్ట్‌లో చెలరేగిన మంటలను అదుపు చేస్తున్న దృశ్యం (ఫైల్)

- ఆకులు రాలే కాలం.. అప్రమత్తతే ముఖ్యం
- గతేడాది పలుచోట్ల ప్రకృతి సంపద బుగ్గిపాలు
- అటవీశాఖ ముందస్తు అవగాహన చర్యలు

రాయదుర్గం: అడవులు విస్తరిస్తేనే ఆశించినస్థాయిలో వానలు కురుస్తాయి. భూగర్భజలాలు వృద్ధి చెంది పంటలు పండుతాయి. పచ్చని ఆహ్లాదాన్ని పంచుతూ, పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుంది. వన్యప్రాణులు, పశుపక్షాదుల జీవన సంరక్షణకు తోడ్పాటునిస్తోంది. ఇంతటి ప్రావీణ్యం కలిగిన అడవులకు నిప్పు పెట్టి ముప్పు తలపెట్టే చర్యలను మానుకోవాలి. లేకుంటే భవిష్యత్తు చీకటిమయం కాకతప్పదు.

నిర్లక్ష్యానికి తప్పదు భారీ మూల్యం

డివిజన్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, కంబదూరు ఫారెస్ట్ సెక్షన్లు, 10 బీట్‌లు ఉన్నాయి. వాటిలో 24వేల హెక్టార్ల మేర అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఇందులో నీలగిరి, నారేప, రాగి, జువ్వి, మర్రి, నేరేడు, ఫెల్‌టోఫారం, కానుగ లాంటి వివిధ రకాల మొక్కలు పెరిగి పెద్దవయ్యాయి. వాతావరణంలో మార్పులు మొదలయ్యాయి. ఉదయం, సాయంత్ర వేళల్లో చలి వణికిస్తున్నా పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. సంక్రాంతి తర్వాత మరింత ఎక్కువయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఆకులు రాలికుప్పలుగా మారుతున్నాయి. వాహనాల్లో వెళ్లేవారు, జీవాలను అటవీ ప్రాంతాల్లోకి తీసుకెళ్లే కాపరులు తాగిన బీడీలు, సిగరెట్లు పూర్తిగా ఆర్పకుండా పడేస్తుంటారు. వీటి వల్ల మంటలు రగులుతుంటాయి. జాగ్రత్త వహించాల్సిన బాధ్యత అందరిపైనా ఉంటుంది.

పునరావృతం కారాదు!

కుందుర్పి మండలం జంబుగుంపల ఫారెస్ట్‌లో గత ఏడాది మంటలు చెలరేగి కొంతవరకు నష్టం వాటిల్లింది. అప్రమత్తమైన అధికారులు మంటలను అదుపు చేసేందుకు కష్టపడ్డారు. అలాగే ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోనూ పలు కొండల్లో అగ్ని రాజుకుంది. రాయదుర్గం కొండలో విలువైన సీతాఫలం చెట్లు కొన్ని కాలిపోగా, కళ్యాణదుర్గం అక్కమాంబ కొండలో పలుచోట్ల ప్రకృతి సంపద బుగ్గిపాలైంది. ఇలాంటి వాటికి ఈ వేసవిలో తావివ్వకుండా జాగ్రత్తపడాలి.

చెట్ల ఆకు.. పంటకు ఉపయోగం

చెట్ల నుంచి రాలిన ఆకు సేంద్రీయ ఎరువుగా మార్చి పొలాల్లో చల్లితే పంటకు ఉపయోగపడుతుందని వ్యవసాయశాఖ నిపుణులు చెపుతున్నారు. నిప్పు పెట్టడం వల్ల ఏ ప్రయోజనమూ ఉండదు. రాలిన ఆకును సైతం సద్వినియోగం చేసుకోవచ్చు. నేలలో కలిసిపోతే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. తేమతో ఘన వ్యర్థాలుగా మారుతాయి. చెట్ల వద్దే వదిలేస్తే సేంద్రీయంగా మారి చెట్లు పెరగడానికి దోహదం చేస్తుంది. దీనివల్ల మరింత బలపడుతాయి. ఎన్నో ఫలాలు, ప్రయోజనాలు పొందవచ్చు.

అవగాహనతో ముందస్తు చర్యలు



వేసవిలో అడవులు అగ్నికి ఆహుతి కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాం. స్థానికులకు అవగాహన కల్పించడంతో పాటు సిబ్బందితో పర్యవేక్షణ పెంచుతాం. అటవీ సమీప గ్రామాల్లో అవగాహన చర్యలు చేపడతాం. వేసవి సమీపిస్తుండడంతో దీనిపై ప్రత్యేక దృష్టి సారించాం. అడవుల సంరక్షణ బాధ్యత అందరిదీ. జూలై ఆఖరి వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ అడవీ ప్రాంతాల్లో బీడీలు, సిగరెట్లు తాగడం, మూగజీవాలను మేపేందుకు వెళ్లే వారు అగ్గిపెట్టెలు తీసుకెళ్లడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అటవీ సంరక్షణ చట్టం కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపుతాం. కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలి.

– సి.మధుబాబు, ఫారెస్ట్ రేంజర్, కళ్యాణదుర్గం

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- బిక్కి హరికి పలువురు నేతల పరామర్శ

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ నేత, మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి భర్త బిక్కి హరిని పోలీసులు బుధవారం ఉదయం ఓ అక్రమ కేసులో అరెస్టు చేశారు. పోలీసులు ఆయన్ను పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య, రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామితో పాటు మున్సిపల్ చైర్మన్ రాజ్ కుమార్, వైస్ చైర్మన్ జయం ఫణి, పార్టీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, కౌన్సిలర్లు సుధీర్, లక్ష్మన్న, పరమేశ్వరప్ప, రామాంజినేయులు, హరి, కో ఆప్షన్ సభ్యులు అఫ్జల్, మారుతి, సురేష్, అడ్వొకేట్లు హనుమంతరెడ్డి, ఎర్రిస్వామి, రామాంజినేయులు, సీనియర్ నాయకులు నారాయణపురం వెంకటేశులు, గోళ్ల సూరి, నరేంద్రరెడ్డి, యర్రంపల్లి కృష్ణమూర్తి, రేవన్న గౌడ్, ఎంఎస్ రాయుడు, తిప్పేస్వామి, పరంధామరెడ్డి, రాజగోపాల్, చంద్రశేఖర్ రెడ్డి, విరుపాక్షి, నాగరాజు, చరణ్, దుర్గా ప్రసాద్, తిప్పానాయక్, శివశంకర్ నాయక్, హబీబ్,రాజు, రామిరెడ్డి, షేక్షావలి తదితరులు పరామర్శించి..ధైర్యం చెప్పారు. అక్రమ కేసులకు భయపడవద్దని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలకు నిరసనగా పార్టీ తరఫున పోరాటాలు చేస్తామన్నారు.

పారదర్శకంగా రీ సర్వే



మాట్లాడుతున్న ఆర్డీఓ వసంతబాబు

శెట్టూరు: నూతనంగా ప్రవేశపెట్టిన భూ రీసర్వేను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తామని ఆర్డీఓ జి. వసంతబాబు అన్నారు. బుధవారం మండలంలోని అయ్యగార్లపల్లిలో తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి ఆధ్వర్యంలో రీసర్వేపై గ్రామసభను నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ అయ్యగార్లపల్లి గ్రామాన్ని రీసర్వేకు పైలెట్ ప్రాజెక్టుగా ఎనుకున్నట్లు పేర్కొన్నారు. రీ సర్వేలో ముందుగా గ్రామ పొలిమేర సరిహద్దులు గుర్తిస్తామన్నారు. రైతుల భూములు సర్వేచేసేటప్పుడు ప్రతి రైతులకు లిఖిత పూర్వకంగా నోటీసులు అందజేస్తామన్నారు.

రైతులకు న్యాయం చేయండి

గ్రామంలో సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇచ్చి న్యాయం చేయాలని జెడ్పీటీసీ మంజునాథ ఆర్డీఓను కోరారు. గ్రామంలో ఓ వ్యక్తి సుమారు 200 ఎకరాల భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకున్నాడని, గ్రామ కంఠం, గ్రామ కుంట తదితర భూములు ఒకే వ్యక్తికి అప్పటి అధికారులు కట్టబెట్టారన్నారు. గ్రామంలో సుమారు 2 వేల ఎకరాలకు సంబంధించి రైతులకు పట్టాలు ఉన్నాయని, 50 మంది రైతులు తరతరాలుగా భూమి సాగు చేస్తున్నా నేటికీ పట్టాలు లేవన్నారు.

న్యాయం చేయండి



పురుషోత్తంరెడ్డి తోటలోంచి దారి ఏర్పాటు చేసిన దృశ్యం

రాయదుర్గం/గుమ్మఘట్ట: గుమ్మఘట్ట మండలం ఎర్రంపల్లిలో తమ పొలాల మధ్య దారి ఏర్పాటు చేస్తూ నిర్దాక్షిణ్యంగా చెట్లను కూల్చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని బాధితులు పురుషోత్తంరెడ్డి, గంగిరెడ్డి కోరారు. బీటీపీ 17వ డిస్ట్రిబ్యూటరీ పరిధిలో పిల్లకాలువ కోసం 1961లో 349బీ1లో 10 సెంట్ల స్థలం భూసేకరణ చేశారన్నారు. రెవెన్యూ రికార్డుల్లోనూ కాలువ ఉన్నట్టు చూపుతోందన్నారు. అయితే కొందరు పనిగట్టుకుని తమ పొలాల్లో దారి ఏర్పాటు చేస్తూ దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. అడ్డుకుంటే అంతుచూస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారన్నారు.

పొలం పనుల్లో రైతుల బిజీ



ఎర్రంపల్లి సమీపంలో వరినారు పెంచేందుకు భూమిని సిద్ధం చేస్తున్న రైతులు

గుమ్మఘట్ట: భైరవానితిప్ప ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయడంతో రైతులు పొలం పనుల్లో బిజీ అయ్యారు. గత నెల 28న ప్రధాన కాలువలకు సాగునీరు విడుదలైంది. మండలంలోని నేత్రపల్లి, ఎర్రంపల్లి, భూపసముద్రం, బేలోడు గ్రామాల రైతులు పొలాల్లోని కంపచెట్లు, పిచ్చిమొక్కలు తొలగించి వరినారు వేసుకునేందుకు సేద్యం చేసుకుంటున్నారు.

ఫారంపాండ్లతో భూగర్భ జలాల పెంపు



మాట్లాడుతున్న ఎంపీడీఓ కుల్లాయి స్వామి

కూడేరు: ఉపాధి హామీ పథకం ద్వారా తవ్వే ఫారం పాండ్లతో భూగర్భ జలాలు పెంపొందుతాయి. రైతులు తమ పొలాల్లో ఫారంపాండ్లు తవ్వించుకునేందుకు ముందుకు రావాలని ఎంపీడీఓ కుల్లాయి స్వామి సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ద్వారా 'పనుల కల్పన–కూలీల సంఖ్య పెంపు', బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కుల్లాయి స్వామి మాట్లాడుతూ.. మండలంలో ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల సంఖ్య తక్కువగా ఉందన్నారు. ఈ పథకం ద్వారా రోడ్లు ఏర్పాటు చేయవచ్చన్నారు. కొద్ది రోజులు పోతే వ్యవసాయ పొలాల్లో కూడా పనులు తగ్గిపోతాయన్నారు. ఉపాధి పనులకు వస్తే నిబంధనల మేరకు పనులు చేస్తే రోజు కూలీ రూ.300 వరకు వర్తింస్తుందన్నారు. ప్రజాప్రతినిధులు, ఉపాధి సిబ్బంది ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించాలని సూచించారు. సీడీపీఓ శ్రీదేవి మాట్లాడుతూ.. బాల్య వివాహాలతో బాలికల బంగారు భవిష్యత్ నాశమవుతుందన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఎక్కడైన బాల్య వివాహాలు జరిగితే వెంటనే ఐసీడీఎస్ లేదా పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ తులసీ ప్రసాద్, ఈఓఆర్డీ రాధాకృష్ణ, సర్పంచులు చంద్రశేఖర్, లలితమ్మ, ఓబులేసు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



లైసెన్స్‌దారుల సమావేశంలో మాట్లాడుతున్న ఈఎస్ రామ్‌మోహన్‌రెడ్డి

రాయదుర్గం: గరిష్ట చిల్లర ధర (ఎమ్మార్పీ) కంటే ఎక్కువ మొత్తానికి మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్) రామ్‌మోహన్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన స్క్వాడ్ జయనాథ్‌రెడ్డితో కలసి రాయదుర్గం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం సీఐ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో మద్యం లైసెన్స్‌దారులతో సమావేశం నిర్వహించారు. ఈఎస్ మాట్లాడుతూ అధిక ధరలు విక్రయినట్లు తెలిస్తే తొలిసారి రూ.5 లక్షల జరిమానా, రెండోసారి ఇదేపనిచేపస్తే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. బెల్టుషాపులకు మద్యం సరఫరా చేసినా ఇవే నిబంధనలు వర్తిస్తాయన్నారు. బెల్టుషాపుల నిర్వహణను ఉపేక్షించేది లేదన్నారు. నియోజకవర్గం ఎక్కువగా కర్ణాటక సరిహద్దుకు ఆనుకుని ఉన్నందున ఆ ప్రాంత మద్యం దిగుమతి కాకుండా పటిష్ట నిఘా ఉంచాలన్నారు. ఒకటికి రెండు సార్లు పట్టుబడితే క్రిమినల్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం కేసుల పురోగతి, పట్టుబడ్డ మద్యంపై ఆరా తీశారు. కర్ణాటక మద్యం సీజ్ చేయడంలో సీఐతో పాటు సిబ్బంది పనితీరును అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐ పవన్ కుమార్, ఎక్సైజ్ సిబ్బంది, మద్యం వ్యాపారులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ నయాజ్ అహమ్మద్

వజ్రకరూరు: భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ బాల్యం సుంకులమ్మ అధికారులను కోరారు. బుధవారం చిన్నహోతురులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ నయాజ్ అహమ్మద్ మాట్లాడుతూ.. రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రెవెన్యూ సదస్సులో అందించిన అర్జీలను గడువులోపు పరిష్కరించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. రెవెన్యూ సదస్సులో నాలుగు అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు విజయ్‌కుమార్, గ్రామపెద్దలు గౌతమ్‌కుమార్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కేశవరెడ్డి, హౌసింగ్ ఏఈ చెన్నారెడ్డి, మండల సర్వేయర్ మంజుల, ఆర్ఐ అశ్వర్థనారాయణ, ఎండోమెంట్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాణి, వీఆర్వో వన్నూరప్ప, గ్రామకార్యదర్శులు రామయ్య, సుభాన్‌జీ, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేపై అవగాహన

బొమ్మనహాళ్ / బెళుగుప్ప: తగ్గుపర్తి ఆర్‌ఎస్‌కేలో రీసర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ షర్మిళ, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈనెల 20 నుంచి రీసర్వే కొనసాగుతుందన్నారు. రీసర్వేకు సర్వేయర్లతో బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం గ్రామంలో అధికారులతో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పుష్పావతి, డీటీ సురేఖ, సర్వేయర్లు ప్రభాకర్, నీలకంఠ, రాజు, ఈశ్వరమ్మ, సుమిత్ర, వీఆర్ఓ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి

కూడేరు: ఇప్పేరు గ్రామంలో బుధవారం ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి బాలింతల గృహాలను సందర్శించారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటూ ఎదుగుదల బాగుండాలంటే తల్లిపాలతో పాటు ఆరోగ్య జాగ్రతలు తప్పనిసరిగా తీసుకోవాలని సీడీపీఓ శ్రీదేవి సూచించారు. తర్వాత అంగన్‌వాడీ కేంద్రాల–1, 2లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ సీడీపీఓ యల్లమ్మ, సూపర్ వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పారిజాత, నిర్మలా దేవి పాల్గొన్నారు.

59 మంది ఉద్యోగాలకు ఎంపిక

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ సమీపంలో బోరంపల్లి వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్ గ్రూపులకు చెందిన 59 మంది విద్యార్థులు రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే రాయదుర్గం పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 8 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు

కుందుర్పి: స్థానిక కుసుమగిరి రైతు సంఘం ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో గడిచిన మూడు నెలలుగా ఉచిత శిక్షణ పొందిన 60 మంది నిరుద్యోగ మహిళలకు కుట్టు మిషన్లు అందించనున్నట్లు సీఈఓ నరశింహమూర్తి, అధ్యక్షుడు లక్ష్మీపతి తెలిపారు.

పంట నమోదు తప్పనిసరి

వజ్రకరూరు: రబీ సీజన్‌కు సంబంధించి రైతులు తప్పనిసరిగా పంట నమోదు (ఈ–క్రాప్ బుకింగ్) చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మధుకర్ సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పప్పుశనగ, వేరుశనగ, ఉలవ, పొద్దు తిరుగుడు తదితర పంటకు రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కంబదూరు: కురాకులపల్లి శివారులో పేకాట స్థావరంపై బుధవారం ఎస్ఐ ప్రవీణ్ సిబ్బందితో కలిసి మెరుపుదాడి చేసి 11 మంది జూదర్లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.34 వేల నగదు, 13 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

ఘనంగా పెద్దమ్మ జాతర

బెళుగుప్ప: కోనంపల్లిలో బుధవారం గ్రామ దేవత పెద్దమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. తొలుత దేవతకు ప్రత్యేక పూజలు, శాంతి హోమాలు, పుట్టపూజ, సాక్క భోజన కార్యక్రమాలు, మేటిబాణం, కాట్రబాణం, తలారి బాణం, గట్టు, గొడు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామశాంతి, పాడిపంట అభివృద్ధికి 20 సంవత్సరాల తరువాత గ్రామంలో తిరిగి జాతరను నిర్వహించామని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామ జాతరకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో గ్రామంలో సందడి వాతావరణ నెలకొంది. ఎస్ఐ శివ నేతృత్వంలో పోలీసులు శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

షాపు రూముల వేలం వాయిదా

రాయదుర్గంటౌన్: మున్సిపల్ కూరగాయల మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్ పై అంతస్తులోని షాపు రూముల టెండర్, బహిరంగ వేలం పాట మరోసారి వాయిదా పడింది. గతంలో మూడుసార్లు వాయిదా పడింది. తాజాగా నాలుగోసారి బుధవారం మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఆర్ఓ కొండన్న ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలో పాల్గొనేందుకు వ్యాపారులు ఆసక్తి చూపలేదు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు పై అంతస్తుకు వెళ్లేందుకు సరైన మార్గం ఏర్పాటు చేయాలని, నాన్ రీఫండబుల్ గుడ్‌విల్ తగ్గించాలని కమిషనర్‌ను కోరారు. వేలం పాటలో ఎవరూ లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

అట్టడుగు వర్గాల వారికి ఉచిత న్యాయ సేవలు



మాట్లాడుతున్న జడ్జి శివప్రసాద్ యాదవ్

కూడేరు: అట్టడుగు వర్గాల ప్రజలకు ఉచితంగా న్యాయ సేవలందించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన లక్ష్యమని ఆ సంస్థ సీనియర్ సివిల్ జడ్జి శివ ప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ మీటింగ్ హాల్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ రాజీ మార్గంలో అన్ని రకాల సివిల్, క్రిమినల్, కుటుంబ కేసులు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుల్లాయి స్వామి, సీడీపీఓ శ్రీదేవి, సర్పంచులు లలితమ్మ, చంద్రశేఖర్, ఓబులేసు ఈఓఆర్డీ రాధాకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగదివ్య, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పాసుపుస్తకాలివ్వండి

కళ్యాణదుర్గం రూరల్: సాగులో ఉన్నాము పాసు పుస్తకాలు ఇవ్వడంతో పాటు ఆన్‌లైన్‌లో తమ పేర్లను ఎక్కించాలని బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో కంబదూరు మండలం నూతిమడుగు సీపీ తండాకు చెందిన 22 కుటుంబాల వారు ఆర్డీఓకు వినతిపత్రం ఇచ్చారు. 526 సర్వే నంబర్‌లో 10 ఎకరాల 83 సెంట్ల భూమి ఉందని, 22 గిరిజన కుటుంబాలు సాగులో ఉన్నా పాసు పుస్తకాలు, ఆన్‌లైన్‌లో పేర్లు లేవన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి న్యాయం చేయాలని ఆర్డీఓను వేడుకున్నారు.

మాజీ ఎంపీకి ఘన సన్మానం



తలారి రంగయ్యను సన్మానిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్యను బార్ అసోసియేషన్ సభ్యులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఎంపీ నిధుల నుంచి బార్ అసోసియేషన్ భవన నిర్మాణానికి రూ.15 లక్షలు కేటాయించి భవనం నిర్మించినందుకు కృతజ్ఞతగా స్థానిక బార్ అసోసియేషన్ భవనంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కరణం తిప్పేస్వామి, హనుమంతరెడ్డి, మారెప్ప, ఎర్రిస్వామి, రామాంజినేయులు, రవి, దాదాఖలందర్, కరణం ఎర్రిస్వామి, సంపత్‌కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, సీనియర్ నాయకులు నారాయణపురం వెంకటేశులు, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

కంబదూరు: ఎస్టీయూ మండల ఉపాధ్యాయ సంఘం నూతన క్యాలెండర్‌ను బుధవారం తహసీల్దార్ బాలకిషన్, ఎంఈఓ మదన్‌మోహన్ విడుదల చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ఉరవకొండ: పశువులకు సంక్రమించే సీజనల్ వ్యాధులపై పశుపోషకులకు అవగాహన కల్పించాలి. గ్రామాల్లో వారికి అందుబాటులో ఉండాలని ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేష్ తెలిపారు. బుధవారం స్థానిక పశుసంవర్ధక శాఖ డిప్యూటీ కార్యాలయంలో డివిజన్ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డివిజన్ పరిధిలోని 15 మండలాల నుంచి ఆశాఖ ఏడీలు, పశువైద్యాధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులకు ప్రోత్సాహకాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గంటౌన్: విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. పట్టణంలోని శాంతినగర్‌లో గల వాణి హైస్కూల్‌లో బుధవారం పాఠశాల 8వ వార్షిక క్రీడా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభచూపిన విజేతలకు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రుక్మిణి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 16 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) కింద రూ.22.75 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు బుధవారం రాయదుర్గంలో అందజేశారు.

పేకాట, కోడిపందేలపై ఉక్కుపాదం

బొమ్మనహాళ్: సంక్రాంతి పండగ పేరుతో పేకాట, కోడి పందేలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని ఎస్ఐ నబీరసూల్ హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి పండగ సంతోషంగా చేసుకోవాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్లొద్దన్నారు.

అభివృద్ధికి తోడ్పాటునందించండి

కణేకల్లు: రైతులు రుణాలు సకాలంలో చెల్లించి సహకార సంఘాల అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో ఆపరేటివ్ మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. కణేకల్లు, బ్రహ్మసముద్రం పీఏసీఎస్‌తోపాటు కణేకల్లు ఆదర్శభారతి రైతుసేవా సహకార సంఘంలో వేర్వేరుగా బుధవారం నిర్వహించిన సమావేశాల్లో పాల్గొన్న శ్రీనివాస్ రైతులనుద్దేశించి మాట్లాడారు. సహకార సంఘాల అభివృద్ధిలో రైతులు, సభ్యులు భాగస్వామ్యులు కావాలన్నారు.

కిశోరి వికాసంపై శిక్షణ

బొమ్మనహాళ్: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు కిశోరి వికాసంపై శిక్షణ నిర్వహించారు. ఎంపీడీఓ దాస్ నాయక్, ఎస్ఐ నబీరసూల్, ఈఓపీఆర్‌డీ దాస్, వైద్యాధికారి మల్లేశ్వరి, ఎంఈఓ వీరన్న, ఏపీఎం రాజ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతా తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్య పరిపుష్టి

కుందుర్పి: పౌష్టికాహారం ద్వారానే బాలికల్లో ఆరోగ్య పరిపుష్టి సాధ్యమని స్థానిక వైద్యాధికారులు అనూషా, చాంద్‌బేగం తెలిపారు. బుధవారం ఎస్కే చారిటబుల్ ట్రస్ట్ పర్యవేక్షణలో కేజీబీవీ బాలికల పాఠశాలలో ఆరోగ్యం–ఆహారంపై బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ నిర్మల, ట్రస్ట్ కోఆర్డినేటర్లు శ్రీకాంత్, ఉమాదేవి, మేఘన ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.